నమస్తే తెలంగాణ

నల్లగొండ

12 | నల్లగొండ, శనివారం 25 జనవరి 2025 | NALGONDA

తెలుగు జాతీయ కవిగా నరసింహారెడ్డి

నరసింహారెడ్డి

రామగిరి, జనవరి 24 : భారతీయ భాషల్లోని సమకాలీన కవిత్వంలో అత్యుత్తమ కవితలను ఒకే చోట వినిపించి, భాషా సామరస్యానికి, జాతీయ సమగ్రతకు పట్టం కట్టేందుకు సృజనాత్మక ప్రయత్నంగా ఆకాశవాణి ద్వారా సర్వ భాషా కవి సమ్మేళనం ఈ సంవత్సరం ముంబయి వేదికగా జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పాల్గొని స్త్రీల వ్యక్తిత్వాన్ని 'ఇంద్రధనస్సు' అనే కవితలో పోల్చి చెప్పి సమర్పించారు. ఈ కవిత 22 భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దాంతో ఆయనను 2025 సంవత్సరానికి తెలుగు జాతీయ కవిగా ఎంపిక చేశారు. నరసింహారెడ్డి జాతీయ కవిగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని సృజన సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ సాహితీవేత్తలు తండు కృష్ణ కౌండిన్య, మాదగాని శంకరయ్య, ఉప్పల పద్మ, బండారు శంకర్, చింతల సుధీర్‌కుమార్ అభినందనలు తెలిపారు.

ముగిసిన పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడా పోటీలు

ఖోఖోలో ప్రథమ బహుమతిని గెలుచుకున్న నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

నందికొండ, జనవరి 24 : నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. అనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. బాలుర ఓవరాల్ చాంపియన్స్‌గా అనురాగ్ కాలేజ్ (కోదాడ), బాలికల విభాగంలో సూర్యాపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిలిచాయి. ఖోఖోలో నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ బహుమతి గెలుచుకుంది. కార్యక్రమంలో నందికొండ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య, కాంట్రాక్టర్ నవీన్‌కుమార్, కన్వీనర్ శ్రీనివాస్, నిరంజన్, పీడీ వెంకట్ పాల్గొన్నారు.

నల్లగొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

13 నెలల్లోనే ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది

రైతులే స్వచ్ఛందంగా పోరాటానికి ముందుకొస్తున్నారు

ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది

- కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒక్కటయ్యారు.. ప్రజల కోసం పని చేస్తున్నది బీఆర్‌ఎస్సే
- 28న క్లాక్‌టవర్ సెంటర్‌లో మహా ధర్నాలో పాల్గొననున్న కేటీఆర్
- జిల్లా మంత్రులు దోచుకోవడంలో చాలా బిజీగా ఉన్నారు
- ఇంతవరకు ఎంత ధాన్యం కొన్నారో చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నీలగిరి, జనవరి 24 : 'రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన సాగుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. అందుకు ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభలే నిదర్శనం. ప్రభుత్వంపై రైతులు, ప్రజలు పోరాటానికి స్వచ్ఛంధంగా సిద్ధమై ముందుకు వస్తున్నారు. వాటికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది.' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులు, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను అణిచివేయాలనే చిల్లర ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే ప్రతిపక్ష పార్టీల మీటింగులు అడ్డుకునే కుట్రలు చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలే నిలదీస్తున్నారని, పోరాటాలకు సైతం సిద్ధపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయి ప్రజలను దోచుకుంటున్నాయని అరోపించారు. ఈ పరిస్థితిల్లో రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిలబడుతున్నారన్నారు. ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతాంగం కేటీఆర్‌ను పిలిచి ఆందోళనకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. కరెంటు కోతలు, ఎరువుల కొరత, రైతుబంధు, రుణ మాఫీ అమలుపై రైతులు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందులో భాగంగానే నల్లగొండలో ధర్నాకు సిద్ధపడితే అడ్డుకోవాలని ప్రభుత్వం చూస్తే కోర్టులు తమకు అండగా నిలిచాయని అన్నారు. కోర్టు అనుమతితో ఈ నెల 28న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు స్వచ్ఛందంగా వస్తున్నారని, పోలీస్ యంత్రాంగం, అధికారులు సహకరించాలని కోరారు. జిల్లా మంత్రికి దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపోతుందన్నారు. రైతులను మోసం చేస్తూ మిల్లర్ల దగ్గర కమీషన్ తీసుకుంటున్నారని, జిల్లా రైతాంగానికి వెయ్యి కోట్ల రూపాయల వరకు మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న రైతులపై దాడులు చేస్తున్నారని అన్నారు. నల్లగొండ జిల్లాకు కొత్తగా ఒక్క రూపాయి కూడా తెచ్చింది లేదని.. గతంలో కేసీఆర్ ఇచ్చిన నిధులతోనూ పనులు ముందుకు పోతలేవని పేర్కొన్నారు. జిల్లా మంత్రి చేస్తున్న మోసాలపై రైతులు కదిలి రావాలని పిలుపునిచ్చారు.

కొన్న ధాన్యం, చెల్లించిన బోనస్ వివరాలు ప్రకటించాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, ఆయనకు దమ్ముంటే రాష్ట్రలో గత సీజన్‌లో పండించిన ధాన్యం, కొనుగోలు చేసిన సరుకు, రైతులకు చెల్లించిన బోనస్‌పై ప్రకటన చేయాలని సవాల్ చేశారు. ఇంతవరకు ఎంత ధాన్యం కొన్నారో చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని రైతుల విషయం మాట్లాడుతున్నారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులను చూసి పారిపోతున్నారని పేర్కొన్నారు. అంద్రాతో కొట్లాడి కృష్ణా జలాలు తెచ్చి పారించామని, 40లక్షల టన్నుల ధాన్యం పడించి నల్లగొండను అన్నపూర్ణగా మార్చిన ఘనత తమదని చెప్పారు. అందుకే ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నామన్నారు. గ్రామ సభల జాబితాలపై ప్రభుత్వం తిరోగమనం పట్టిందని, ఇప్పటికే మూడు సార్లు దరఖాస్తులు చేశారని, అవి ఎటు పోయాయని ప్రశ్నించారు. వాటిని కూడా అమ్ముకునే దౌర్భాగ్యులు కాంగ్రెస్ నేతలని ఆరోపించారు.

ఉత్తమ్, భట్టి మాటల్లోనే దావోస్ డొల్లతనం

కేటీఆర్ ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మూడు లక్షల ఉద్యోగాలను 9 లక్షలకు చేర్చారని, రూ.40వేల కోట్ల ఐటీ ఎగుమతులను రూ.2.40 లక్షల కోట్లకు పెంచారని తెలిపారు. మంత్రులు భట్టి, ఉత్తమ్ మాటల్లోనే దావోస్ డొల్లతనం స్పష్టంగా కనిపించిందన్నారు. దావోస్‌లో పెట్టుబడులన్నీ ఇంతకు ముందు కేటీఆర్ హయాంలోనే జరిగాయని, దావోస్ వేదికగా మెగాతో ఒప్పందం డెస్టినేషన్ పెళ్లిలా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ తీరుతో తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తింటుందన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా 20లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత కేటీఆర్‌ది అన్నారు. సంచులు మోసిన అనుభవం ఉన్న రేవంత్‌రెడ్డి లాంటి వాళ్ల నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేమని, కేటీఆర్‌తో ఎందులోనూ పోటీ పడలేరని, చిల్లర చేష్టలు.. చిల్లర మాటలతో తెలంగాణ పరువు తీస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, నాయకులు నిరంజన్ వలీ, మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, సింగం రామ్మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ ఎంపీపీలు కరీంపాషా, నారబోయిన భిక్షం, మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నాయకులు అయితగోని యాదయ్య, మారగోని గణేశ్, రంజిత్, జమాల్ ఖాద్రి పాల్గొన్నారు.

గ్రామసభల్లో రచ్చరచ్చ

- జాబితాలపై అభ్యంతరాల వెల్లువ
- ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లిస్ట్‌లో పేరు లేకపోవడంతో ఆగ్రహావేశాలు
- పెద్దసంఖ్యలో కొత్తగా దరఖాస్తులు
- ముగిసిన గ్రామసభలు
- నల్లగొండ జిల్లాలో కొత్త దరఖాస్తులు 1,17,644
- ప్రభుత్వ విప్ అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌కు నిరసనల సెగ
- కోదాడ మండలంలో టెంట్లు కూల్చిన గ్రామస్తులు

చివరి రోజూ నిలదీతలు... అడ్డగింతలు

నల్లగొండ మండలం కొత్తపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు

కోదాడ రూరల్ : రామలక్ష్మీపురంలో టెంట్ కూలుస్తున్న దరఖాస్తుదారులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి24(నమస్తే తెలంగాణ) : ఈ నెల 26 నుంచి అమలు చేస్తామంటున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాపై ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి తీవ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చివరి రోజు శుక్రవారం కూడా అనేక చోట్ల ప్రజలు అధికారులపై తిరుగబడ్డారు. ఇవేం జాబితాలంటూ నిలదీతలు.. అడ్డగింతలు.. ప్రభుత్వానికి శాపనార్థాలతో గ్రామసభలు ముగిశాయి. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం రూపొందించిన జాబితాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జాబితాల్లోని పేర్లు ఎక్కడి నుంచి తీసుకున్నారో చెప్పలేక అధికారులు నీళ్లు నమలాల్సి వచ్చింది. జాబితాల్లోని లబ్ధిదారుల్లో ఎక్కువ మంది అనర్హులు ఉన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తగా అర్హులైన వారిని ఎందుక పరిగణలోకి తీసుకోలేదన్న ప్రజల ప్రశ్నలకు వారి నుంచి సమాధానం లేకుండా పోయింది. ప్రజలకు అక్కడికక్కడే ఏమీ చెప్పలేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో కొత్తగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్క నల్లగొండ జిల్లాలోనే మొత్తం 1,17,644 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠీ వెల్లడించారు. కొత్త దరఖాస్తులపై ఎప్పటి వరకు నిర్ణయం తీసుకుంటారనే దానిపై మాత్రం స్పష్టత కరువైంది.

ఈ నెల 21 నుంచి శుక్రవారం వరకు నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామసభల్లో రచ్చరచ్చ జరిగింది. గ్రామసభల నిర్వహించి ప్రజల మెప్పు పొందాలని ప్రభుత్వం భావిస్తే... ప్రజలు మాత్రం మరోలా స్పందించారు. ఒక దశలో ఎందుకు గ్రామసభలు పెట్టామో అర్థం కాని అయోమయంలోకి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు వెళ్లారు. గ్రామసభలు జరిగిన మెజార్టీ గ్రామాల్లో ప్రజల నుంచి వ్యతిరేకతే తప్ప సానుకూలత వచ్చింది చాలా తక్కువ. ప్రభుత్వం పైనుంచి పంపిన లబ్ధిదారుల జాబితాలకు ఒక ప్రమాణికం అంటూ లేకపోవడంతో చాలామంది అర్హులకు అందులో చోటు దక్కలేదు. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో అనర్హులు పథకాల జాబితాలో ఉండడంతో సామాన్యులు జీర్ణించుకోలేక పోయారు. దాంతో గ్రామాల్లో ఎవరి ప్రోద్బలం లేకుండా సామాన్య ప్రజలు స్వచ్ఛందంగా తిరగబడ్డారు. పార్టీలను, రాజకీయాలను పక్కన పెట్టి అర్హులైన పేదలంతా తమ కడుపు మంటను చూపెట్టారు. ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ ఉక్కిరిబిక్కిరి చేశారు. దాంతో అధికారులు చాలా చోట్ల మిన్నకుండిపోయి జాబితాలు చదివి తమ పనైపోయిందన్న తీరును ప్రదర్శించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారిన చోట ఎక్కువ మాట్లాడితే కొత్తగా దరఖాస్తు చేసుకోండి.. తర్వాత చూద్దామన్నట్లు వ్యవహరించడం గమనార్హం. ఇలానే నాలుగు రోజుల పాటు గ్రామసభలు కొనసాగాయి. శుక్రవారం కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును నిలదీస్తూ వెంటపడి తరిమి తమ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లగొండ జిల్లాలోని నిడమనూరు మండలం గుంటకగూడెంలో గ్రామస్తులు రేషన్ కార్డుల జాబితాపై అధికారులను నిలదీశారు. తమ పేర్లు ఎందుకు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతపల్లి మండలం గొడుకొండ్లలో ఉదయం 11.30 గంటల వరకు అధికారులు పత్తా లేకపోవడంతో ప్రజలు మండిపడ్డారు. నకిరేకల్ మండలం తాటికల్లులో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేకపోవడంతో పేదలు తీవ్ర వాగ్వివాదం చేశారు. పెద్దవూర, పులిచర్లలో గ్రామస్తులు అధికారులతో వాదనకు దిగారు. మర్రిగూడ మండలం రాజపేటతండాలో జాబితాలో అనర్హులు ఉండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిప్పర్తి మండలం ఇండ్లూరులో ఇండ్లు, రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు రాలేదని మండిపడ్డారు. కనగల్ మండలం బుడమర్లపల్లిలో మాజీ సర్పంచ్ కారింగు జానయ్య జాబితాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హుల పేర్లు గల్లంతయ్యాయని పేదలతో కలిసి అధికారులను నిలదీశారు. ఇంకా చాలా గ్రామాల్లో గ్రామసభలు ప్రజల అభ్యంతరాలు, కొత్త దరకాస్తుల స్వీకరణ నడుమ కొనసాగాయి.

వెల్లువలా కొత్త దరఖాస్తులు

నల్లగొండ జిల్లాలో నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామసభల్లో కొత్తగా ప్రజల నుంచి 1,17,644 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠీ శుక్రవారం వెల్లడించారు. ఇందులో రైతుభరోసా కోసం 844, రేషన్‌కార్డుల కోసం 53,844, ఇందిరమ్మ ఇండ్ల కోసం 47,471, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 15,485 దరకాస్తులు ఉన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటన్నింటినీ త్వరలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన జాబితాల్లోని రైతుభరోసా మినహాయిస్తే మిగతా మూడు పథకాల్లోని లబ్ధిదారుల కంటే కొత్త దరఖాస్తుదారుల సంఖ్యనే ఎక్కువగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

సూర్యాపేట 14వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా ఏడిపిస్తున్నారంటూ రోదిస్తున్న ఓ మహిళ

సూర్యాపేట జిల్లాలో కూలిన టెంట్లు

సూర్యాపేట జిల్లాలో ఎమ్మెల్యే సామేలుకు నిరసన సెగ తాకింది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుకు తుంగతుర్తి మండల కేంద్రంలో గ్రామ సభకు హాజరు కాగా, ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ ప్రజలు నినాదాలు చేశారు. దాంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంపటి గ్రామంలోనూ ఎమ్మెల్యే సామేలు హాజరు కాగా, గ్రామసభ రసాభాసగా మారి టెంట్‌ను కూల్చివేశారు. అన్ని అర్హతలు ఉన్నా పథకాలు ఎందుకు ఇవ్వరు? ఇవ్వాలనుకునే వారికి నేరుగా ఇచ్చుకోవాలి తప్ప గ్రామసభలు ఎందుకు అని గ్రామస్తులు నిలదీశారు. సూర్యాపేట 14వ వార్డులో ఓ కన్నీటి పర్యంతమైంది. మహిళలను కోటీశ్వరులను చేస్తామని పెద్ద పెద్ద మాటలు మాట్లాడి ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వకుండా ఏడిపిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. మునగాల, కొక్కిరేణి, వెంకట్రామాపురం, జగన్నాథపురం, కోదాడ మండలం రెడ్లకుంటలో అనర్హులే పేర్లు అధికంగా ఉన్నాయని గ్రామస్తులు రచ్చ రచ్చ చేశారు. ఇదే మండలంలోని రామలక్ష్మిపురంలో అర్హుల పేర్లు జాబితాలో లేవని దరఖాస్తుదారులు ఆగ్రహంతో గ్రామసభ టెంట్ కూల్చారు. నూతనకల్ మండలం అలుగూనురు గ్రామ సభలో జడ్పీ సీఈఓ అప్పారావును సన్న వడ్లకు బోనస్ రాలేదని నిలదీశారు. ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రంలో తాసీల్దారుతో గొడవ పడ్డారు. మఠంపల్లి మండలం వర్ధాపురం, తిరుమలగిరి 13వ వార్డు, పెన్‌పహాడ్ మండలం అనాజిపురం, నాగులపాటి అన్నారంలో అధికారులను నిలదీశారు.

ఎమ్మెల్యే సామేల్‌పై ప్రజాగ్రహం

- గ్రామసభలో నిలదీసిన జనం
- మధ్యలోనే వెళ్లిపోయిన ఎమ్మెల్యే

తుంగతుర్తిలో నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

తుంగతుర్తి/ అర్వపల్లి, జనవరి 24 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యలపై నిలదీశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతుండగా.. సంక్షేమ పథకాల అర్హుల పేర్లను చదివిన తర్వాతే మాట్లాడాలని అడ్డుకున్నారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. లిస్టులో తమ పేరు లేదని, అనర్హుల పేర్లు వచ్చాయని ప్రశ్నించడంతో సభ రచ్చరచ్చగా మారింది. ఎమ్మెల్యే డౌన్ డౌన్ నినాదాలు చేశారు. ఇంతలో పోలీసులు పెద్ద ఎత్తున వచ్చి ఎమ్మెల్యేను అక్కడి నుంచి తరలించారు. దాంతో సభ అర్థాంతరంగా ముగిసింది. అర్వపల్లి మండలంలోని రామన్నగూడెం గ్రామ సభకు హాజరైన ఎమ్మెల్యే సామేల్‌కు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని ఎమ్మెల్యేను నిలదీశారు. సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో తమ పేరు ఎందుకు లేదని, తాము ఎవరికి చెప్పుకోవాలని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఊరిలో వేరే ఊరి వాళ్ల పెత్తనం ఏంటని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గంవారు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది.


ఆత్మకూర్ (ఎస్) : అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


తిప్పర్తి మండలంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు


అర్వపల్లి : రామన్నగూడెంలో పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

డబ్బులిస్తే పేరు ఫైనల్!

- జాబితాలో పేరుంది.. పైసలిస్తే ఓకే చేయిస్తామంటూ దందా
- కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వ కుమ్మక్కై వసూళ్లు

సూర్యాపేట, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : 'సంక్షేమ పథకం జాబితాలో మీరు పేరు ఉంది.. కానీ, అది ఫైనల్ అయినట్టు కాదు.. డబ్బులు ఇస్తే మేం ఒకే చేయిస్తాం' అంటూ కొందరు వసూళ్ల దుకాణం తెరిచారు. గ్రామ సభలు, పట్టణ వార్డు సభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల పేర్లు అంటూ సభల్లో చదివి వినిపించగా, అర్హత ఉన్నా తమకు ఎందుకు రావడం లేదంటూ జనం పెద్దఎత్తున జనం ఎదురు తిరగడం తెలిసిందే. దాంతో ఆ జాబితా ఫైనల్ కాదంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు మాట మార్చారు. ఇదే అదునుగా చేసుకొని కొంతమంది కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ శాఖల కిందిస్థాయి సిబ్బందితో కలిసి వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి ప్రజాపాలన పేరిట గ్రామ గ్రామన జరిగిన సమావేశాల్లో ప్రజల నుండి వివిధ పథకాలకు దరఖాస్తులు తీసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలనుకుంటే ఆ జాబితా చాలు. కానీ ప్రభుత్వం మీ సేవ, ప్రస్తుత గ్రామ సభల ద్వారా దరఖాస్తులు తీసుకోవడంతోపాటు సర్వే పేరుతో కాలయాపన చేస్తూ వచ్చింది. మెజారిటీ అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో ఏ అంశాలను ప్రమాణికంగా తీసుకున్నారో తెలియని గందరగోళం నెలకొంది. తాజాగా గ్రామ సభల్లో చదువుతున్న జాబితాలో పేరు వారిని దళారులు టార్గెట్ చేస్తున్నారు. కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సర్వేల పేరిట రెవెన్యూ, పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ సిబ్బంది తిరుగుతుండగా.. కొంతమంది అధికార పార్టీ నాయకులు జాబితాలో పేరున్న వారి వద్దకు వెళ్లి రూ.20వేల నుంచి 30 వేలు అడుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కసారి డబ్బులు ఇస్తే జీవిత కాలం పథకాలతో డబ్బులు వస్తాయని నమ్మబలుకుతున్నారు. ఇలా తుంగతుర్తి నియోజకవర్గంలో పది మంది నుంచి, కోదాడ నియోజకవర్గ పరిధిలోని మునగాల మండలంలో ముగ్గురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తున్నది.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మంత్రుల మాటలన్నీ ఉత్తిపోతలే..

- మాదారం, రెడ్లకుంట, సింగారం ఎత్తిపోతల నుంచి ఒక్క ఎకరా తడువలే
- వారి పాలనకు గ్రామసభలే సాక్షీభూతాలు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ, జనవరి 24 : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ఆయకట్టు చివరి ప్రాంతం రైతులకు సాగునీరు అందించేందుకు పదుల కొద్ది ఎత్తిపోతలు మంజూరు చేయించానని చెప్పుకొనే మంత్రి ఉత్తమ్ మాటలు గాలి కబుర్లేనని, ఇప్పటికీ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడలోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో తమ ప్రభుత్వం అగ్రభాగాన ఉన్నదని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే ఉత్తమ్.. గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తున్న వాస్తవాలను అవగతం చేసుకోవాలన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై నిరుపేదలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని తెలిపారు. హామీ ఇచ్చిన ఏ ఒక్క పథకాన్నీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. కోదాడ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల చేసిన వ్యాఖ్యలు ఓటేసిన ప్రజలను వంచించడమేనని మండిపడ్డారు. మాదారం, సింగారం, రెడ్లకుంట ఎత్తిపోతల నుంచి ఒక్క ఎకరాకు కూడా చుక్కనీరు అందలేదని, మోతె మండలానికి పాలేరు నుంచి సాగునీరు రప్పిస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతోనే గోదావరి జలాలు మోతె, నడిగూడెం, మునగాల మండలాల భూములను తడిపాయని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో వారి అభివృద్ధి శంకుస్థాపన చేసిన శిలాఫలకాల్లోనేనని, ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా పోయలేదని అన్నారు. అభివృద్ధి పనుల పేరుతో కమీషన్లు దండుకోవడమే ఆయన పని అని ఆరోపించారు. కోదాడ మున్సిపాలిటీ టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిందన్నారు. ఇప్పటికైనా గెలిపించిన నియోజకవర్గాల్లో ఉత్తమ్, పద్మావతి దంపతులు నిబద్ధతతో అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు నయీం, భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టు శివాజీనాయక్, నాయకులు అజయ్‌కుమార్, నర్సిరెడ్డి, రమేశ్, జానకి, రామాచారి, రమేశ్, సురేశ్‌నాయుడు, ఇమ్రాన్‌ఖాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.